సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కుల గణనకు సహకరించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబర్2: నేటి సమాజంలోని సామాజిక అసమానతలను తొలగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టే కుల గణనకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా పేద ప్రజల, వెనుకబడిన తరగుతుల ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదని, వారిజీవితాల్లో కొత్త వెలుగులు నింపడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో వర్తింపచేయడానికి కులగణన గణాంకాలు సహకరిస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తుందని, అన్ని వర్గాల ప్రజలు కుల గణనలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వివరాలను నమోదు చేయించుకోవాలి

కడ్తాల్ : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో ప్రజలందరూ తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని నాయబ్ తహసీల్దార్ ఆదిత్య అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాల్లో అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జాబితా ప్రకారం ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. ఎన్యుమరేటర్లు చేపట్టిన సర్వే తీరును ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ ముంతాజ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో విజయ్‌కుమార్‌పాల్, జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కడ్తాల్: ముద్విన్ గ్రామంలో చేపట్టిన సర్వేలో పాల్గొన్న డీటీ ఆదిత్యా

సదర్ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్/షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 2: పట్టణంలో షాద్‌నగర్ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న యాదవ సదర్ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యాదగిరియాదవ్, యాదవ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు యాదయ్యయాదవ్, భీమయ్యయాదవ్, మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రఘునాథ్‌యాదవ్, అంజయ్యయాదవ్, నర్సింహులుయాదవ్, ప్రవీణ్‌యాదవ్, గిరియాదవ్, బాల్‌రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్, నర్సింహులుయాదవ్, రమేశ్‌యాదవ్, రవియాదవ్, మాధవులు యాదవ్, రాజుయాదవ్, మురళీయాదవ్, కిషోర్‌యాదవ్, రాజూయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల రూరల్, నవంబర్ 2 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న సమయంలో నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి బదులుగా గ్రామ పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సొంత నిధులు వెచ్చించి విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామస్తులు బేగరి అరుణ్‌కుమార్, గ్రామ పెద్దలు సామ విఠల్‌రెడ్డి, మల్‌రెడ్డి, మాణిక్యం, మాజీ సర్పంచ్ శ్యామలయ్య, జంగయ్యగౌడ్, రాజిరెడ్డి, రమేశ్, బుచ్చయ్యగౌడ్, ఈశ్వర్, శ్రీనివాస్, రవీందర్, శ్రీపాల్, రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీ సంఘం కమిటీ ఎన్నిక

కడ్తాల్, నవంబర్ 2: కడ్తాల్ గ్రామ బాలాజీ తాపీ మేస్త్రీ సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కాలె శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా సిద్ధిగారి మహేశ్, సభ్యులుగా బాలరాజు, పోతగళ్ల కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను లక్ష్మీనర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాపీ మేస్త్రీ సంఘానికి అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. సంఘం సభ్యులు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ గ్రామాధ్యక్షుడు నర్సింహ, నాయకులు రామచంద్రయ్య, సంఘం సభ్యులు జంగయ్య, రాములు, పారేశ్, వీరేశ్, నర్సింహ, శేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

కార్యవర్గాన్ని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

భూసారం.. నిస్సారం

వరికొయ్యలు కాలబెడితే భూమికి తీవ్ర నష్టం
భూసారం దెబ్బతినే ప్రమాదాలు ఎక్కువ
పాలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 2 : అన్నదాతలు పూర్వం వరిచేళ్లను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతే కాకుండా అప్పటి రోజుల్లో పశువులు ఎక్కువగా...వరిసాగు తక్కువగా ఉండటంతో పశుగ్రాసం కుప్పలు కుప్పలుగా పెట్టుకునేవారు. కానీ, ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. యంత్రాలను విరివిగా ఉపయోగిస్తుండటంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం వరికోతలు ప్రారంభమైనందున రైతులు ఎంతో కొంత గడ్డిని తెచ్చుకోవడం, మిగిలిన దానిని అక్కడే వదిలివేస్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతో పాటు గడ్డిని కాలబెడుతున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ వరికొయ్యలను తగులబెట్టకూడదని వ్యవసాయ నిపుణులు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరికొయ్యలను తగులబెట్టడం ద్వారా అధిక నష్టాలు వాటిల్లే ప్రమాదముందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం పంటల కోతలు ప్రారంభమైనందున రైతులు గతంలో వేసిన పంటలకు సంబంధించిన మిగిలిపోయిన వరికొయ్యలను తగులబెట్టడం ద్వారా అధిక నష్టం వాటిల్లే అవకాశమున్నందున, కాల్చడం మానేసి రైతులు పొలాన్ని కలియదున్నితే అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు చాలా మంది వరినాటు వేసే సమయంలో మొదటి దఫా దున్నుడు, రెండో దఫా దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదురోజుల సమయం మాత్రమే తీసుకుంటారు. దీనివల్ల కొయ్యకాలు, గడ్డి త్వరగా కుళ్లిపోవు. ఇలాంటి సమయంలో పశువులను అందులో వదిలితే అటూ తిరుగడం, పొలంలో పేడ, మూత్ర విసర్జన చేయడం ద్వారా త్వరగా కుళ్లిపోయి భూసారం పెరుగుతుంది. పంట దిగుబడి 5శాతం పెరుగుతుంది. లేదంటే అందులోనే కలియదున్ని కనీసం ఎనిమిది రోజుల సమయం తీసుకుని రెండు దఫాలు దున్నాలి. వీలైతే మొదటి దఫాలో ఒక్కసారి రోటోవేటర్‌తో దున్నితే గడ్డి, కొయ్యకాలు చిన్నచిన్న ముక్కలుగా విడిపోయి మారు దున్నినప్పుడు ఎలాంటి సమస్యా ఉండదు. దున్నే ముందు ఎకరానికి క్వింటాల్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోతాయి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు.

కొయ్యలు కాల్చటం భూమికి తీవ్ర నష్టం..

రైతులు వరికొయ్యలు కాల్చటం ద్వారా భూసారం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముంది. మంటల ద్వారా విపరీతమైన వేడితో భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం అధికంగా ఉన్నందున రైతులు వరికొయ్యలు కాల్చటం పూర్తిగా మరిచిపోవాలి. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు అగ్నికి బుగ్గపుతుండటంతో పర్యావరణానికి తీరని హాని కలుగుతుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

కలియ దున్నితే అధిక ప్రయోజనాలు..

వరికొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కార్బన్ శాతం పెరిగి దిగుబడులు 5నుంచి 10శాతం పెరిగే అవకాశముంది.

దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.

కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.

మొక్కలకు 2శాతం నత్రజని (యూరియా) 4శాతం ఫాస్ఫరస్ అదనంగా అందిస్తుంది.

జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి.

నేలలో కరుగని మూలకాలనూ పంటకు అనుకూలంగా మార్చుతుంది.

నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

వరికొయ్యలు సేంద్రియ ఎరువు

ప్రస్తుతం రైతులు వర్షాకాలం పంటలసాగులో భాగంగా వేసిన వరి పంట చేతికొచ్చినందున వరిపంటలు కోసే పనులు ప్రారంభించారు. కోతల అనంతరం పొలాలను సిద్ధం చేసుకునే రైతులు తమ వ్యవసాయ పొలాల్లోని వరికొయ్యలను తగులబెట్టకుండా భూమిని కలియదున్నటం ద్వారా ఇది సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. వరికొయ్యకాలకు నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. కొయ్యకాలును పొలంలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. దున్నే ముందు తప్పని సరిగా సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతాయి. మురిగిన కొయ్యకాలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించవచ్చు.

- శ్రవణ్‌కుమార్,
వ్యవసాయశాఖ ఏఈఓ ఇబ్రహీంపట్నం

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

కడ్తాల్, నవంబర్ 2: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తున్నదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో ఆలయ చైర్మన్‌గా పవన్‌కుమార్‌రెడ్డి, సభ్యులుగా అమృత, స్వామిగౌడ్, వెంకటయ్య, యాదయ్య, జంగయ్యలతో జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవో స్నేహలత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు నూతన కమిటీ సభ్యులను నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, బ్లాక్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాములు,

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాయకులు భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాసచారి, కృష్ణారెడ్డి, నర్సింహ గౌడ్, రేణురెడ్డి, రమేశ్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మాజీ ఎంపీటీసీ పాండును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, నవంబర్ 2: మండలంలోని తిమ్మారెడ్డిగూడలో మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండును ఎమ్మెల్యే కాలె యాదయ్య పరామర్శించారు. శనివారం సాయంత్రం మాజీ ఎంపీటీసీ పాండు తల్లి పోచమ్మ మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యాదయ్య గ్రామానికి వెళ్లి పోచమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆమె కుమారుడు మాజీ ఎంపీటీసీ పాండు, మాజీ సర్పంచ్ శకుంతలను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు రామస్వామి, కృష్ణగౌడ్, చెన్నయ్య, నర్సింహులు ఉన్నారు.

బీఆర్ఎస్ నేత రాంరెడ్డికి ఘన నివాళి

మాడ్గుల, నవంబర్ 2: మాడ్గుల మండల పరిధిలోని అప్పరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాంరెడ్డి వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంరెడ్డి పార్టీకి అందించిన సేవలు మరవలేనివని ఆయన కొనియాడారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శంకర్ నాయక్, లాలయ్యగౌడ్, లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటయ్య, చెన్నయ్య, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

రాంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

షాబాద్, నవంబర్ 2: పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, హైతాబాద్, నాందార్‌ఖాన్‌పేట్, చర్లగూడ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పశువులు అనారోగ్యానికి గురికాకముందే రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బలరాం, కృష్ణ, శ్రీనివాస్, సుధాకర్, బాల్‌రాజ్, శ్రీకాంత్, రాణి పాల్గొన్నారు.

హైతాబాద్‌లో పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

టీటీడీ మెంబర్ నర్సిరెడ్డికి సన్మానం

ఆమనగల్లు, నవంబర్ 2: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా ఇటీవల నియమితులైన టీడీపీ సీనియర్ నేత నన్నూరి నర్సిరెడ్డిని శనివారం ఆమనగల్లు మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో నర్సిరెడ్డిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కె.సత్యనారాయణ, టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోశాధికారి నర్సింహ, నాయకులు పంచాక్షరి, పద్మనాభం పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాదిలాల్

సర్వే నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పించాలి

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

యాచారం, నవంబర్2: కుల గణన సర్వే నుంచి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టపాక ప్రవీణ్‌కుమార్, సత్తు పాండురంగారెడ్డి అన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సర్వే కోసం మధ్యాహ్నం వరకే పాఠశాలలు నడిపి విద్యార్థులను వదిలేయడంతో విద్యార్థుల చదువు ఆగమై పోతుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో 48,229 మంది ఉపాధ్యాయులు నవంబర్ నెల మొత్తం సర్వేలో ఉండటంతో విద్యార్థుల చదువుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను వయోజన విద్యకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను విద్యా బోధనకు తప్ప ఇతర కార్యక్రమాలకు ఉపయోగించవద్దని వారు ప్రభుత్వానికి సూచించారు. కుల గణన సర్వే నుంచి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మినహాయింపు సౌకర్యం కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు.

యాచారం సీఐగా నరసింహారావు

యాచారం, నవంబర్2: మండల సీఐగా ఏ. నరసింహారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. యాచారం సీఐగా విధులు నిర్వహించిన శంకర్‌కుమార్ బదిలీపై మహేశ్వరం వెళ్లారు. అతడి స్థానంలో మహేశ్వరం ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న నరసింహారావు యాచారం సీఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతలను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి తదితర నిషేధిత వస్తువుల రవాణా, సైబర్ నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులకు ప్రజలు తమ వంతుగా సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి

షాద్‌నగర్, నవంబర్2: తమ పనుల కోసం బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన కేశంపేట మండలం లేమామిడి గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కొత్తూరు మండలం కొడిచర్ల తండాకు చెందిన రవినాయక్ (21), రాకేశ్‌నాయక్ (19) అన్నదమ్ములు. ఇరువురు కలిసి తమ వ్యవసాయ ట్రాక్టర్‌కు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి బైక్‌పై బయలుదేరారు. ఇందులో భాగంగానే బైక్ లేమామిడి శివారుకు రాగానే తల కొండపల్లి వైపు నుంచి వస్తున్న టిప్పర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవినాయక్, రాకేశ్‌నాయక్‌లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌ను తప్పించబోయిన టిప్పర్ బోల్తాపడింది. జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేశంపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు సొంత అన్నా తమ్ముడు మృతిచెందడంతో కొడిచర్ల తండాలో తీవ్ర విషాదం నెలకొన్నది. ఇటీవలి కాలంలో కేశంపేట మండలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిందని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, నవంబర్ 2: తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన నకరమోని పెద్దయ్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ అందించిన రూ.3 వేలను అందజేశారు. వీరితో పాటు బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు ఎల్లయ్య, జంగయ్య, రమేశ్, అంజయ్య, రవి, విజయ్‌కుమార్, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

మంచాల, అక్టోబర్ 2: మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో వీఆర్ఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన, కంటివైద్య శిబిరాన్ని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి నేరుగా గ్రామానికే వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 35మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఎన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీహెచ్ డైరెక్టర్ వేణుగోపాల్ రావు, మాజీ సర్పంచ్‌లు, శ్రీనివాస్‌గౌడ్, మోతీ రాంనాయక్, మల్లేశ్, గ్రామస్తులు రాజు, వెంకటేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

కొత్తూరు, నవంబర్ 2: ఆలయాల నిర్మాణాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని మల్లాపూర్ పంచాయతీ పరిధిలోని రాగ్యాతండాలో నిర్మిస్తున్న లలితాంబికాదేవి ఆలయానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి రూ. 51వేలు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్‌నాయక్, ఆలయ చైర్మన్ మోహన్‌నాయక్, వైస్ చైర్మన్ లోబ్యానాయక్, శంకర్, బీక్యా, మాన్య, నారాయణ, పీర్యా, రఘు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల చట్టాలను కాలరాస్తే సహించం

మొయినాబాద్, నవంబర్ 2 : పోరాటం చేసి సాధించుకున్న హక్కులు, చట్టాలను కాలరాసే కుట్ర చేస్తే ఊరుకునేది లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కె రామస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ చౌరస్తాలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హక్కులు, చట్టాలను కాలరాసే కుట్ర చేస్తే పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శివయ్య, చేవెళ్ల మండల అధ్యక్షుడు శివ, బీవోసీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు రాజు, రాములు, అమరేందర్, వెంకటేశ్, మల్లారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

కడ్తాల్, నవంబర్ 2: తలకొండపల్లి మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని... మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు శనివారం